బడిబయట పిల్లల గుర్తింపు

- 33 అంశాల సేకరణపై దృష్టి
- ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించే ప్రక్రియ
- మలక్‌పేట నియోజకవర్గంలో సర్వే మరూ
- 156 మందిని గుర్తించిన సిబ్బంది


అజంపురాలో సర్వే చేస్తున్న సిబ్బంది


సర్వేలో పిల్లలను గుర్తించిన సిబ్బంది

చాదర్‌ఘాట్: సమ్మెను వీడి సమగ్ర శిక్షా ఉద్యోగులు సర్వే బాటపట్టారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వటంతో సమ్మె విరమించిన క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ) క్షేత్రస్థాయిలో గురువారం నుంచి పర్యటిస్తున్నారు. బడి నుంచి డ్రాపవుట్ అవుతున్న విద్యార్థులను గుర్తించేందుకు రంగంలోకి దిగారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా డివిజన్లు అంబర్‌పేట మండల పరిధిలోకి వస్తాయి. ఈ మేరకు ఈ మండలంలో సర్వే ప్రారంభమైంది. 6–14 ఏళ్లలోపు, 15–19 ఏళ్ల వయస్సు కలిగిన వారు చదువుకోక పోవటానికి గల కారణాలను సీఆర్పీలు ఆరా తీసి గుర్తించే పనిలో పడ్డారు. మొత్తం 156 మందిని ఇప్పటివరకు గుర్తించారు.

33 అంశాల సేకరణపై దృష్టి..

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే పత్రంలో 33 అంశాలను అధికారులు పొందుపర్చారు. సర్వేకు వెళ్తున్న రిసోర్స్ పర్సన్ డ్రాపవుట్ అయిన విద్యార్థి పేరు, తల్లిదండ్రులు, ఆధార్ సంఖ్య, అడ్రస్, మాతృభాష, చదువుకు దూరం కావాటానికి గల కారణాలను నమోదు చేయాల్సి ఉంటుంది. దాంతో బస్తీలు, మురికివాడలు, మార్కెట్లు, దుకాణాలు, హోటల్స్, బస్‌స్టాప్‌లు, కూలీల అడ్డాలు తదితర ప్రాంతాల్లోకి వెళితే సదరు పిల్లలను గుర్తించే పనిలో పడ్డారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు కూడా...

ప్రత్యేక అవసరాల పిల్లలను సైతం గుర్తించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. వారి ఆర్థిక స్థితిగతులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను నివేదికలో పొందుపరచనున్నారు. పాఠశాల విద్యతోపాటు ఇంటర్ చదువులకు దూరంగా ఉన్నవారిని గుర్తించేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఈ సర్వే ప్రారంభం కాగా ఇప్పటి వరకు 156 మందిని గుర్తించినట్లు సీఆర్‌పీ కుమార్ వెల్లడించారు. వీరందరిని బడిలో చేర్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: వారానికి రెండు గంటలు శ్రమించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అదే ఆరోగ్యానికి రక్షణ అని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ శుక్రవారం డివిజన్ పరిధిలోని మధురానగర్, భవానీనగర్, శ్రీరామాహిల్స్ కాలనీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కాలనీవాసులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంతో విలువైన మంచినీటిని వాటర్‌పైపుతో ర్యాంపులను, పరిసరాలను కడుగుతున్నారని, దీంతో మంచినీరు వృథాగా పోయి, రోడ్డుపై గుంతలలో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. తమ ఇంట్లోని చెత్తను కాలనీ రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, చెత్త ఆటోకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ నీలిమ, ఎస్ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, జవాన్ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్స్ హమీద్, లక్ష్మణ్, కాలనీలవాసులు పద్మారావు, వర్మ, సీత వెంకటేష్, బీరప్ప, కృష్ణ, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజాల జగన్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ సదన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి


చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు బస్తీల్లోని పార్కుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సరస్వతీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. అనంతరం హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులతో కలిసి పార్కులో పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్‌లను వీడి మైదానాల్లో ఆటలకు దగ్గరయ్యేలా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. సరస్వతీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో పిల్లల కోసం ఆట పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని రకాల వసతులు కల్పించామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ హెచ్‌ఏ సుష్మ, ఇంజనీరింగ్ ఏఈ శిరీష పాల్గొన్నారు.

సింగరేణిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మించండి

కలెక్టర్‌కు బాలల హక్కుల పరిరక్షణ వేదిక వినతి

సైదాబాద్: నగరంలోనే అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతంలోని విద్యార్థుల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు వేదిక ప్రతినిధులతో కలిసి ఆయన శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల సమీపంలోనే అనువైన ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులో కొందరు చెత్తాచెదారం వేస్తుండటం వల్ల స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ స్థలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సింగరేణి కాలనీసహా పరిసర బస్తీల్లోని పిల్లలు సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేక చాలామంది డ్రాపవుట్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలు, మురికివాడల చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సింగరేణి కాలనీలోని ప్రభుత్వస్థలంలో ఉన్నత పాఠశాల నిర్మించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో వేదిక కార్యదర్శి అలివేలు, సంతోషి, శారద ఉన్నారు.

ఎన్జీవోస్ కాలనీలో మోడల్ లైబ్రరీ నిర్మిస్తాం

గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో హౌసింగ్ సొసైటీ ఇచ్చిన 400 గజాల స్థలంలో త్వరలో మోడల్ లైబ్రరీని నిర్మించి దానిని డిజిటల్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తామని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎన్జీవోస్ కాలనీలోని రేకులషెడ్డులో నడుస్తున్న గ్రంథాలయాన్ని, ఆదే ప్రాంగణంలో గ్రంథాలయం కోసం కాలనీ హౌసింగ్ సొసైటీ ఇచ్చిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ రేకులషెడ్డు శిథిలం కావడంతో వర్షాకాలం తడిచి విలువైన పుస్తకాలు పాడవుతున్నాయని, కనీస వసతులు లేక సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయం నిర్మాణానికి రూ.1.90 కోట్లు మంజూరయ్యాయని, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రితో మాట్లాడి త్వరలోనే భవన నిర్మాణం చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పద్మ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సోమయాజులు, ఓంప్రకాష్, సీహెచ్‌వీ ఆర్‌కే మూర్తి, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరప్ప, నవీద్, హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు...
ఏకలవ్యనగర్, సైదాబాద్ మెయిన్‌రోడ్, పూసలబస్తీ, రెడ్డిబస్తీ

ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు...
తాల మజీద్, రహ్మత్‌నగర్ పరిసర ప్రాంతాలు

మధ్యాహ్నం 12:30 నుంచి ఒంటి గంట వరకు...
తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారా నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్టీవో ఆఫీస్, బాలాజీ అపార్ట్‌మెంట్స్, వహీద్‌నగర్, జెండా పీటీ, ఓల్డ్ మస్తాన్ గట్టీ, ఏ టు జెడ్, అల్లాలా మజీద్, న్యూ వాహీద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన తెలిపారు.

19న కుల సంఘాల సమావేశం

నాగోలు: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని అన్ని కుల, ప్రజా, బీసీ సంఘాలతో ఈ నెల 19న ఉదయం 10 నుంచి 4 గంటల వరకు కర్మన్‌ఘాట్‌లోని గ్రీన్ పార్క్ కాలనీ శిల్పి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తిని సుధాకర్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మలక్‌పేటలో మహిళ అదృశ్యం


అంజనమ్మ

మలక్‌పేట: ఆసుపత్రిలో రోగికి హెల్పర్‌గా ఉన్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... వనపర్తి జిల్లా రాజాపేట గ్రామానికి చెందిన అంజనమ్మ(36) కూలీ. అదే జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఆటోడ్రైవర్ వల్లెపు వీరబాబు భార్య సువర్ణను ఈ నెల 10 తేదీన మలక్‌పేటలోని కృతిక ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో సువర్ణకు హెల్పర్‌గా అంజనమ్మను పెట్టారు. అంజనమ్మ సమాచారం ఇవ్వకుండా ఈ నెల 15 తేదీన ఉదయం 11 గంటలను ఆసుపత్రి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా, బంధువులను విచారించినా ప్రయోజనం లేకుండాపోయింది. వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి


కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని రెవెన్యూ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణపనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా అధికారులు, స్థానిక కాలనీలవాసులు తరచూ పర్యవేక్షిస్తుండాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు సత్యనారాయణ, శ్రీనివాస్, రాంప్రసాద్, పాండు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడులు


ఐదుగురి అరెస్టు


బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో సరూర్‌నగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సరూర్‌నగర్ పరిధిలో గల నందనవనం, బాలాపూర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, లెనిన్ నగర్‌లో బెల్టు షాపులపై దాడులు జరిపారు. ఈ సంఘటనలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. దాడుల్లో 16.9 లీటర్ల బీరు, 21.52 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజృంభణ... విలవిల

- కాలనీల్లో దోమలతో పెరుగుతున్న విషజ్వరాలు
- వ్యాధుల బారిన పడుతున్న కాలనీల ప్రజలు



దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. మూసీనదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల ప్రజలు విలవిలలాడుతున్నారు. దోమలు కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, పైలేరియా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'డెంగీ, మలేరియాను నివారిద్దాం.. మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం'అంటూ ఇప్పుడు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓల్డ్ మలక్‌పేట్, ముసారాంబాగ్, తీగలగూడ, ఎన్‌టీఆర్ నగర్, సింగరేణి కాలనీ, అంబేడ్కర్‌నగర్ కాలనీల్లో రాత్రిపగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. కలుషిత జలాలతో నిండిన చెరువులు, విరివిగా పెరిగే చెట్ల చుట్టుపక్కల ప్రాంతాలు, మురికివాడలు దోమల ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో దోమకాటు బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి: విజయ్ కుమార్, ఆర్‌కే పురం

ఈ సీజన్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందుచూపుతో వ్యవహరించి ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి. కాలనీలు, బస్తీల్లో విరివిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి. డ్రైనేజీ లీకేజీలు, చెత్తాచెదారం లేకుండా శానిటేషన్ విభాగం అధికారులు కృషి చేయాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: డాక్టర్ అర్చన

వర్షాకాలంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటిస్తే రోగాల బారి నంచి కాపాడుకోవచ్చు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతోపాటు నీటిలో తేమ శాతం పెరిగిపోతుంది. దీంతో గొంతు బొంగురు పోవడం, చలి, జ్వరం, డెంగీ, మలేరియా, కీళ్ల నొప్పులు వస్తాయి. వర్షా కాలంలో ఇంటి చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, కాచి వడపోసిన నీటిని తీసుకుంటే మంచిది. జ్వరం రెండు రోజులకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలి.

కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ పారిజాత అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి 16వ డివిజన్ బాలాపూర్ గ్రామం 15వ డివిజన్‌లోని సీపీఎస్‌ఆర్‌కాలనీ, గ్రీన్‌సిటీ, సీతాహోమ్స్, 24వ డివిజన్ జయశంకర్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులతో పాటు అల్మాస్‌గూడ 26వ డివిజన్ శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం 31వ డివిజన్ బాలాజీనగర్ కాలనీలో రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాంరెడ్డి, రామిడి కవిత, ఎర్ర జైహింద్, శశిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి

వాహనచోదకులకు ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య అవగాహన


ద్విచక్రవాహన దారునికి అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో లెక్కల కిష్టయ్య


వాహనదారునికి రోజా పువ్వు ఇచ్చి అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రమేష్‌బాబు

మలక్‌పేట: వాహనదారులు తప్పకుండా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఈస్ట్‌జోన్ మలక్‌పేట ఆర్టీవో లెక్కల కిష్టయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసారంబాగ్ ఆర్టీవో కార్యాలయంలో 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం– రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం 'అనే నినాదంతో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, సీటు బెల్ట్ పెట్టుకుంటునే ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకుంటాయని తెలిపారు. ప్రతీ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తీసుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఆర్టీవో అధికారులు, మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల సంయుక్తంగా అంబర్‌పేట మూసారంబాగ్ దారిలో ఎంవీఐలు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్‌బాబు, రాధిక, నరేంద్రపాల్, బలరామ్, ఏఎంవీఐలు మధుసూదన్‌రెడ్డి, జాన్, అశ్వాక్, ఏఓలు ప్రవీన్, మధుకర్, అంజుమ్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సై రాము మాట్లాడుతూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాము

రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.11, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.40, దొండ రూ.50, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.32, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.33, కీర రూ.35, బీన్స్ రూ.47, క్యాప్సికమ్ రూ.47. శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా పోరెడ్డి రవీందర్‌రెడ్డి



చంపాపేట: చంపాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన పోరెడ్డి రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి శుక్రవారం చంపాపేటలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని రవీందర్‌రెడ్డికి అందచేశారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీవాసులతో నిత్యం మమేకమై బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు


డప్పు వాయిస్తూ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: చెత్తను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చెత్తను జీహెచ్‌ఎంసీ సూచించిన ప్రాంతాల్లోనే వేయాలని హయత్‌నగర్ సర్కిల్ శానిటేషన్ డీఈ నీలిమ తెలిపారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం శానిటేషన్ సిబ్బంది, అధికారులతో కలిసి డప్పు కొడుతూ చెత్తపై అవగాహన కలిపించారు. నీలిమ మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయని, దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. దుకాణదారులకు, ఇంటి యజమానులు చెత్తను రోడ్లపై వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

చెత్తకుప్పలు... దుర్గంధం

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో ప్రధాన రోడ్లతోపాటు కాలనీల్లోని అంతర్గత రోడ్ల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఆయా కాలనీల్లో ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను ప్లాస్టిక్ కవర్లలో తీసుకువచ్చి రోడ్డు వెంబడి పడేసి పోతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు చెత్తకు నిలయంగా మారుతున్నాయి. చెత్తకుప్పలు పేరుకుపోయిన చోట కుక్కలు నివాసం ఉంటూ చెత్తను తవ్వుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో ఆ దారిన వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్తను రోడ్ల వెంబడి వేయకుండా చూడటంలోనూ, పేరుకుపోయిన చెత్తను సకాలంలో తొలగించడంలోనూ శానిటేషన్ సిబ్బంది విఫలమవుతున్నారని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శానిటేషన్ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.


హస్తినాపురం పద్మావతినగర్ కాలనీలో ఇండియన్ గ్యాస్ గోదాం రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త